## క్లుప్తంగా

### గండి నిత్యాన్నదానానికి రూ.50 వేలు విరాళం



రూ.50వేల నగదును అందిస్తున్న అంజన్‌కుమార్ కుటుంబ సభ్యులు

చక్రాయపేట : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీగండి వీరాంజనేయస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి బుధవారం అన్నమయ్య జిల్లా కలకడ మండలం దేవలపల్లె గ్రామానికి చెందిన అంజన్‌కుమార్ కుటుంబ సభ్యులు రూ.51,116ల నగదును ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్యకు విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా అంజన్ కుమార్ దంపతులను ఆలయ ప్రధాన అర్చకులు కేసరి, మాజీ ఆలయ చైర్మన్ కల్లూరు వెంకటస్వామిలు దర్శనం చేయించి కండువాలు ఇచ్చి తీర్థ ప్రసాదాలను అందించారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేముల : మండలంలోని మబ్బుచింతలపల్లె, వేల్పుల, రాచకుంటపల్లె, భూమయ్యగారిపల్లె, మెడికల్ కళాశాల పరిధిలో 33 కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. వ్యవసాయ మోటార్లకు మాత్రమే విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, ఈ విషయాన్ని రైతులు గమనించి సహకరించాలన్నారు.

### నేడు మోరీయా ప్రార్థన మందిరం ప్రారంభం

వేంపల్లె : మండలంలోని కుమ్మరాంపల్లెలో నూతనంగా నిర్మించిన మోరీయా ప్రార్థన మందిరాన్ని గురువారం ప్రారంభిస్తున్నట్లు మందిరం నిర్వాహకురాలు రత్నకుమారి, భాస్కర్ రావులు ఒక ప్రకటనలో తెలిపారు. మోరీయా ప్రార్థన మందిరాన్ని ప్రారంభించేందుకు హైదరాబాద్‌కు చెందిన హెబ్రోన్ దైవ సేవకులు మత్తయి, కడపకు చెందిన దైవ సేవకులు ఆనంద్‌రాజ్‌లు వస్తున్నారన్నారు.

### తప్పనిసరిగా మత్స్యకారులు బీమా చేసుకోవాలి

కొండాపురం : గండికోట జలాశయంలో చేపలు పట్టే మత్స్యకారులు ప్రతి ఒక్కరు తప్పకుండా బీమా లేని వారు బీమా(ఇన్సురెన్స్) చేసుకోవాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. బుధవారం పాతకొండాపురం పోలీస్‌స్టేషన్ సమీపంలోని వెనుకజలాల్లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో 4.50 లక్షల చేప పిల్లలను ఆయన వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండికోట జలాశయంలో చేప పిల్లలు పెంపకంతో మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

### దిగుబడి తగ్గిన ప్రొద్దుతిరుగుడు

కొండాపురం : మండలంలోని కోనవారిపల్లె గ్రామ రెవెన్యూ పొలంలో అంతర్‌పంట కింద సాగు చేసిన ప్రొద్దుతిరుగుడు పంట పొలంలో దిగుబడి తగ్గినట్లు ఎఎస్‌వో మహేంద్రారెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చవ్వ నాగార్జునరెడ్డి రైతుపొలంలో 5 గీ5 మీటర్ల విస్తీర్ణంలో పంటకోత ప్రయోగం చేయగా 0.300 గ్రాములు దిగుబడి వచ్చిందన్నారు. అలాగే ఒంటెద్దు శివలక్షుమ్మ పొలంలో 5 గీ5 మీటర్ల విస్తీర్ణంలో పంటకోత ప్రయోగం చేయగా 1.3 కేజిల దిగుబడి వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఫ్యూచర్ జనరల్ ఇన్సురెన్స్ ప్రతినిధి పి.విజయ్‌కుమార్‌రెడ్డి, ఎఈఓ రమేష్, వీహెచ్‌ఎ సురేష్‌బాబు, వీఆర్‌ఎలు పాల్గొన్నారు.

### ఘనంగా బాలరాముని కల్యాణం



కోలాటం ఆడుతున్న మహిళలు

జమ్మలమడుగు : పట్టణంలో శ్రీశ్రీ అవదూ కాశినాయన దేవాలయం ఆవరణలో ఉన్న రామ మందిరం మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఘనంగా బాలరాముని కల్యాణం నిర్వహించారు. బుధవారం స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించి కల్యాణోత్సవం చేశారు. ఈ సందర్భంగా కన్నెలూరు మహిళలు కల్యాణోత్సవం సందర్భంగా కోలాటం వైభవంగా నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

### జీవిత బీమా సంస్థలో పోస్టులు భర్తీ చేయాలి

జమ్మలమడుగు రూరల్ : భారత జాతీయ బీమా సంస్థలో కొంత కాలంగా ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని జమ్మలమడుగు జీవిత బీమా సంస్థ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని జీవిత బీమా సంస్థ కార్యాలయ ఆవరణలో ఉద్యోగ సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. రెండు సంవత్సరాల కాలంలో 5,400 మంది ఉద్యోగులు రిటైర్డ్ అవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో క్లాస్ 3, 4 కేడర్లలో తక్షణమే నియామకాలు చేపట్టాలన్నారు. బ్రాంచ్ ఉపాధ్యక్షుడు డి.నరసింహం, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# కూలీల చేతిలో బ్రహ్మాస్త్రం జన్‌వన్‌రేగా

- 2017లో అందుబాటులోకి తీసుకొచ్చిన కేంద్రం
- యాప్‌లో ఉపాధి కూలీల సమగ్ర వివరాలు
- స్మార్ట్‌ఫోన్ ఉంటే సులభంగా సేవలు
- అక్రమాలపైనా ఫిర్యాదు చేసే అవకాశం
- యాప్‌పై అవగాహన లేక నష్టపోతున్న కూలీలు



ఎర్రగుంట్ల మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఎర్రగుంట్ల : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పాదర్శకతను పెంచి అక్రమాలకు తావివ్వకుండా కేంద్ర ప్రభుత్వం అనేక సంస్కరణలను అమలు చేస్తోంది. పనులు మంజూరు, నిర్వహణ, వేతనాలకు సంబంధించిన అనేక మార్పులు తీసుకొస్తోంది. కూలీల వేతనాలు దుర్వినియోగం కాకుండా నేరుగా బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఖాతాలను తెరిపించి జమ చేస్తోంది. అయితే వేతన జీవులు చాలా మంది తమ ఉపాధి బకాయిలు జమయ్యాయో.. లేదో.. ఒక వేళ జమైతే ఏ బ్యాంకులో పడ్డాయో తెలియక ఉపాధి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఇలాంటి ఇబ్బందుల నుంచి గట్టెక్కించేందుకు కేంద్ర ప్రభుత్వం జన్‌వన్‌రేగా యాప్‌ను 2017లో అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనిపై సరైన అవగాహన లేక దుర్వినియోగం చేసుకుంటే ఉపాధి కూలీల చేతిలో బ్రహ్మాస్త్రం అవుతుందని అధికారులు చెబుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో యాప్‌పై క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించారు. అయినా కూలీలు సద్వినియోగం చేసుకోక నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించిన సంగతి తెలిసిందే. ఇలాంటి తరుణంలో జన్‌వన్‌రేగా యాప్‌తో ఉపాధి పనుల్లో అక్రమాలకు చెక్‌పెట్టేందుకు వీలవుతుందని నిపుణులు చెబుతున్నారు.

**యాప్ వినియోగం ఇలా...**

స్మార్ట్‌ఫోన్‌లోని గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి జన్‌వన్‌రేగా అని టైప్ చేసి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ తరువాత ఇన్‌స్టాల్ చేసుకుని అందులో ఉపాధిల జాబ్ కార్డు సంఖ్యలో నమోదు చేసి క్లిక్ చేస్తే కూలీల విరరాలు వస్తాయి. కూలీ పేరుపై క్లిక్ చేయగానే పనిచేసిన రోజులు, వేతన బకాయిలు ఏ బ్యాంకు ఖాతాలో నగదు ఉంటుంది. తదితర వివరాలు స్పష్టంగా తెలుస్తాయి. వేతనం జమకాకపోతే ఎందుకు జమకాలేదో అనే అంశం కూడా తెలుసుకోవచ్చు. ఉపాధి పనులు సమాచారం కూడా ఉంటుంది.

**అక్రమాల పైనా ఫిర్యాదులు చేయొచ్చు..**

కూలీల సొమ్ము స్వాహాతో పాటు ఇతర అక్రమాలపై కూడా జన్‌వన్‌రేగా యాప్ ద్వారా ఫిర్యాదు చేసే వెసులుబాటు ఉంది. క్షేత్ర స్థాయిలో పని ప్రదేశాల్లో కూలీలతో కాకుండా యాంత్రాలతో పనులు చేసినా, బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసినా నిధులు దుర్వినియోగం చేసిన, బోగస్ మస్టర్లకు పాల్పడినా యాప్‌లో ఫిర్యాదు చేస్తే నేరుగా కేంద్ర ప్రభుత్వం దృష్టికి వెళుతుంది. అనంతరం కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేకూరుస్తారు.

**యాప్‌పై అవగాహన కల్పిస్తాం..**



జన్‌వన్‌రేగా యాప్ వినియోగంపై కూలీలందరికి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తాం. సెల్ ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ వినియోగం, తదితర అంశాలపై చైతన్యపరుస్తాం. కూలీలు కూడా ఈ యాప్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలి. ఎంతో ఉపయోగపడే ఈ యాప్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

– గంగాభవాని, ఉపాధి ఏపీఓ, ఎర్రగుంట్ల

# సస్యరక్షణతో వరిలో మంచి దిగుబడులు



రైతులకు సూచనలు ఇస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

వల్లూరు : మండలంలోని ఇసుకపల్లె, సీ కొత్తపల్లె గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి రైతులు సాగు చేసిన వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. వరి పంటలో ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలను గురించి రైతులకు వివరించారు. వరిలో ఆకు ముడత, కాండం తొలుచు పురుగు ఆశించినట్లయితే ఒక లీటరు నీటికి 1.5 గ్రాముల అసిఫేట్ లేదా 2 గ్రాముల కార్ టాప్ హైడ్రోక్లోరైడ్ కలిపి పిచికారి చేయాలని సూచించారు. వరి వంట సాగు చేసే రైతులు దుక్కిలో ఎకరాకు 20 కేజీల జింక్ సల్ఫేట్‌ను మూడు పంటలకు ఒకసారి ఖచ్చితంగా వేసుకోవాలని తెలిపారు. వరి నాటిన పొలంలో జింకు ధాతు లోపము కనిపిస్తే ఒక లీటరు నీటికి 1 గ్రాము చిలేటెడ్ జింకు మరియు 5 గ్రాముల యూరియా కలిపి పిచికారి చేయాలని సూచించారు. అదేవిధంగా ఒక లీటరు నీటికి 10 గ్రాముల 19-19-19 కలిపి పిచికారి చేయడం వలన పంట పెరుగుదల బాగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి సాయి జ్యోతి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు సురేఖ, రైతులు పాల్గొన్నారు.

## కాలిబాటలు తప్పనిసరి

కమలాపురం : వరి పంటలు సాగు చేసే రైతులు ప్రతి 2 మీటర్లకు 30 సెం.మీ. చొప్పున కాలి బాటలు తప్పని సరిగా ఏర్పాటు చేయాలని మండల ఏఓ సరస్వతి తెలిపారు. బుధవారం పట్టణ పరిధిలోని వరి పంటలను ఆమె పరిశీలించారు. వరి పంటల సాగులో మెలకువలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి 2 మీటర్లకు 30 సెం.మీ. చొప్పున బాటలు ఏర్పాటు చేస్తే పంటకు గాలి, వెలుతురు, ఉష్ణోగ్రత అందుతుందన్నారు. గట్ల పైన పెరిఫెరల్ ప్లాంటేషన్ బంతి, కంది, మొక్కజొన్న, సస్పెనియా వంటివి నాటుకోవాలన్నారు. కాండం తొలుచు పురుగు, ఆకు ముడత నివారణకు ఏకరానికి 8 లింగాకర్షక బుట్టలు, 10 నుంచి 15 పక్షి స్థావరాలు, పెట్టుకోవాలని తెలియజేశారు. నత్రజని ఎరువులను అధిక మోతాదులో వాడరాదన్నారు. వరి నారు కొనలు తుంచి నాటితే బ్రౌన్ తిలుచు పురుగు గుడ్లు పెట్టకుండా నివారించ వచ్చన్నారు. వాతావరణంలో వచ్చే విపరీతమైన మార్పులను అధిగమించాలంటే ప్రకృతి వ్యవసాయమే శరణ్యం అని ఆమె రైతులకు సూచించారు. సుస్థిర వ్యవసాయానాకి ఇతర మార్గాలు లేని కారణంగా ప్రకృతి వ్యవసాయం వెనుక ఉన్న శాస్త్రీయతను రైతులందరూ గుర్తించాలన్నారు. మొక్కల పెరుగుదలకు ఉపయోగపడే ద్రావణాలైన పంచగవ్య ఏకరానికి నాలుగు లీటర్లు చొప్పున పిలకలు పెట్టే దశలో ఒక సారి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ ఇందిరాదేవి, రైతులు పాల్గొన్నారు.

# రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్ (ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణరాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం, మాగురు, అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు అందిస్తారన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణ బేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

# పశువులకు వైద్య సేవలు



కమలాపురం : జె.కొత్తపల్లెలో నట్టల నివారణ మందు తాపిస్తున్న వైద్యాధికారి మల్లికార్జునరెడ్డి



ఎర్రగుంట్ల : పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న పశువైద్యులు



జమ్మలమడుగు : దూడ పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

కమలాపురం : మండలంలోని జె.కొత్తపల్లెలో బుధవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన 913 పశువులకు వైద్య సేవలు అందించినట్లు ఏడీ ఉత్తయ్య, మండల పశు వైద్యాధికారి మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఇందులో 24 పశువులకు సాధారణ చికిత్సలు, 7 గర్భకోశ వ్యాధులు చికిత్సలు, 167 పశువులతో పాటు715 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి పరిశ్రమ రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించిందన్నారు. ఇందులో భాగంగా మండలంలో ప్రతి రోజు రెండు గ్రామాల్లో శిబిరాలు నిర్వహించి ప్రతి పశువుకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. అలాగే పి.వెంకటాపురంలో పెద్దచెప్పలి పశు వైద్యాధికారిణి శివజ్యోతి శిబిరం నిర్వహించి పశువులకు వైద్య సేవలు అందజేశారు. ఇందులో 109 సాధారణ చికిత్సలు, 23 గర్భకోశ చికిత్సలు, 17 చూడి నిర్ధారణ పరీక్షలు, 47 లేగ దూడలకు ఏలికపాముల మందులు, 187 జీవాలకు నట్టల నివారణ మందు తాపించారు. సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**ఎర్రగుంట్లలో..**

ఎర్రగుంట్ల : తిప్పలూరు గ్రామంలోని పశుసంవర్థశాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పశు వైద్య శిబిరంనకు విశేష స్పందన లభించిందని ఎర్రగుంట్ల పశుసంవర్థశాఖ ఏడీ డాక్టర్ మునెయ్య తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఈనెల 31వ తేదీ వరకు పశుఆరోగ్య శిబిరాలు, అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోట్లదుర్తి పశువైద్యాధికారులు జ్యోతి పాల్గొన్నారు.

**జమ్మలమడుగులో..**

జమ్మలమడుగు : వాతావరణ పరిస్థితులు మారుతుండటంతో పశువులకు రోగాలు రాకుండా వ్యాధినిరోధక టీకాలను ప్రతి రైతు ఇప్పించాలని పశు వైద్యులు జి.జాన్ సుధాకర్ తెలిపారు. బుధవారం మండలంలోని పి.బొమ్మెపల్లిలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 1500 గొర్రెలకు, 257 మేకలకు, 36 దూడలు, 62 గేదెలకు నట్టల నివారణ, ఏలిక పాముల మందులు వేశారు. 8 గెదేలకు గర్భకోశ చికిత్సలు, 6 చూలు పరీక్షలు, 85 సాధారణ చికిత్సలు, 35 కోళ్లకు తెగుళ్ల నివాణ టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. రైతులు తమ పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు.

**చింతకొమ్మదిన్నెలో.**

చింతకొమ్మదిన్నె : అధిక పాలఉత్పత్తికి పశువులను ఆరోగ్యంతో ఉంచాలని పశు వైద్యులు పశు పోషకులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహనలో భాగంగా బుధవారం మండలంలోని లక్కిరెడ్డిపల్లిలో పశువులకు, మేకలకు గొర్రెలకు నట్టల నివారణ మందు తాగించారు. పశువుల ఆరోగ్యం, సీజనల్ వ్యాధులు, నివారణకు, అధిక పాల ఉత్పత్తి పెంచుటకు తదితర వాటి పైన పశుసంవర్ధక ఏడి శ్రీధరలింగారెడ్డి, పాడి రైతులకు సూచనలు చేశారు. జూనియర్ వెటర్నరీ డాక్టర్ చంద్రకిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

**కొండాపురంలో..**

కొండాపురం : మండలంలోని పెంజిఅనంతపురంలో నిర్వహించిన పశు వైద్యశిబిరంలో దూడలకు నట్టల నివారణ మందులు తాపించినట్లు కొండాపురం పశువైద్యుడు జి. రాజశేఖర్‌రాజు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక యాజమాన్య పద్ధతులు గురించి పశు యాజమాన రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం గొర్రెలు, మేకలకు డివార్మింగ్ మందులు పంపిణీ చేశారు.

## ట్రిపుల్ ఐటీలో క్యాంటీన్లు ఏర్పాటు చేయాలి

వేంపల్లె : ఆర్జీయూకేటీ యూనివర్సిటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ, ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ల్లో విద్యార్థుల కొరకు క్యాంటీన్లు, సూపర్ మార్కెట్లను ఏర్పాటు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ రహంతుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు దాదాపీర్‌లు కోరారు. బుధవారం వేంపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ గతంలో ట్రిపుల్ ఐటీల్లో ఉన్న క్యాంటీన్లు, సూపర్ మార్కెట్లను మూసి వేయడంవలన విద్యార్థులు అవసరమైన వస్తువులు కొనుగోలు చేసేందుకు ఇబ్బందిగా మారిందన్నారు. క్యాంటీన్లు, సూపర్ మార్కెట్ లేకపోవడంతో ట్రిపుల్ ఐటీల్లో పనిచేసే అధ్యాపకులకు, విద్యార్థులకు కష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. ట్రిపుల్ ఐటీల్లో ఎక్కువ మంది బాలికలు చదువుకుంటున్నారని, క్యాంటీన్లు ఉన్నప్పుడు ప్రతి రోజూ సాయంత్రంపూట విద్యార్థులు, అధ్యాపకులు స్నాక్స్ తినేందుకు క్యాంటీన్లు వద్దకు వెళ్లి ఆకలిని తీర్చుకోవడం జరిగేదన్నారు. అలాగే సూపర్ మార్కెట్‌కు వెళ్లి అవసరమైన వస్తువులను కూడా కొనుగోలు చేసేవారని, క్యాంటీన్లుపై రాజకీయ ప్రభావం ఉండటంతో ఉన్న క్యాంటీన్లు మూసి వేయడం జరిగిందన్నారు. ట్రిపుల్ ఐటీ అధికారుల నిర్లక్ష్యం ధోరణితో విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి అధికారులు క్యాంటీన్లు, సూపర్ మార్కెట్లను వెంటనే తెరపించాలని కోరారు.

## యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



వేరుశనగలో యాజమాన్య పద్ధతులను వివరిస్తున్న ఏడీఏ, ఏఓలు

వేముల : రబీలో వేరుశనగ సాగు చేసిన రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలని పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. వేములలో బుధవారం ఏఓ చెన్నారెడ్డితో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ సాగులో పెట్టుబడులు పెరిగిపోతున్నాయని, అందుకు అనుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి దిగుబడులు పెంచుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక రైతు సేవా కేంద్రంలో ఈకేవైసీపై వ్యవసాయ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. మండల వ్యాప్తంగా 3524 మంది రైతులు 10815 ఎకరాలలో పంట నమోదు చేయించుకున్నారన్నారు. అయితే 3524 మంది రైతులలో 2087 మంది రైతులు మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారన్నారు. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా 59 శాతం మాత్రమే ఈకేవైసీ పూర్తయ్యిందన్నారు. ఇంకా మిగిలిన రైతులు కూడా సకాలంలో ఈకేవైసీ చేయించుకునేలా వ్యవసాయ అసిస్టెంట్లు రైతులను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ

సింహాద్రిపురం : సింహాద్రిపురంలో బుధవారం ఎస్ఐ తులసీ నాగప్రసాద్ వాహనాల తనిఖీ కార్యక్రమం నిర్వహించి పత్రాలు సరిగా లేని వాహనాలకు జరిమానాలు విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పక లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ద్విచక్రవాహనదారుడు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లకు వాహనాలను ఇవ్వరాదని సూచించారు.

## వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా మదీనా దస్తగిరి



మదీనా దస్తగిరిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల టౌన్ : పట్టణంలో బుధవారం వైఎస్సార్‌సీపీ నూర్‌బాషా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రసూల్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడుగా నియమితులైన మదీనా దస్తగిరిని సత్కరించారు. ఈ సందర్భంగా మదీనా దస్తగిరి మాట్లాడుతూ బాధ్యతలు ఇచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డిలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. పార్టీ బలోపేతం కోసం పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నూరుల్లా, నూర్ బాషా సంఘం ఉపాధ్యక్షుడు బెల్లంకొండ దస్తగిరి, ఆర్‌సీడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన జీవితం సంస్థాగత విజయానికి కీలకం



ఆరోగ్యకరమైన జీవితం సదస్సుకు హాజరైన ఉద్యోగులు

వేముల : యురేనియం ప్రాజెక్టులో పనిచేస్తున్న ఉద్యోగుల ఆరోగ్యకరమైన జీవితమే సంస్థాగత విజయానికి కీలకమని అనంతపురం కిమ్స్ సవేరా ఆసుపత్రి సీనియర్ వైద్యాధికారి డాక్టర్ దుర్గా ప్రసాద్ తెలిపారు. మండలంలోని తుమ్మలపల్లె యురేనియం కర్మాగారంలో ఉద్యోగుల ఆరోగ్య ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఆరోగ్యకరమైన జీవితం గడపడానికి చిట్కాలు‘ అనే అంశంపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సురక్షితమైన, ఆరోగ్యకరమైన జీవన శైలి గురించి కీలక అంశాలను వివరించారు. క్రమం తప్పకుండా యోగా, వ్యాయాపం, సమతుల్య ఆహారపు అలవాట్ల యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఇవి వ్యక్తిగత శ్రేయస్సుకు, వృత్తిపరమైన ఉత్పాదకత రెండింటికి ఎలా దోహదపడతాయో వివరించారు. ఆరోగ్యకరమైన జీవితం గడపడానికి ప్రతి ఉద్యోగి క్రమం తప్పకుండా నియమాలు పాటించాలన్నారు. అనంతరం డాక్టర్ దుర్గా ప్రసాద్‌ను సత్కరించి మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో యూసీఐఎల్ జీఎం సుమన్ సర్కార్, డీజీఎం కిశోర్ భగవత్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లెలో 'వేధిస్తున్న తాగునీటి సమస్య' అనే వార్త సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి బుధవారం నల్లపురెడ్డిపల్లె గ్రామానికి సిబ్బందిని పంపించి తాగునీటి సమస్యలు తలెత్తకుండా పైపులు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను తీర్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఇంటికి తాగునీటి సమస్య రాకుండా చూస్తామన్నారు. గ్రామంలో ప్రతిరోజు నీరు సరఫరా అయ్యే విధంగా సంబంధిత వాటర్ లైన్‌మెన్‌కు సూచనలు, సలహాలు ఇచ్చామన్నారు. తాగునీటి సమస్యను తీర్చిన అధికారులకు, సాక్షి పత్రికా విలేకరికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శారద, పంచాయతీ కార్యదర్శి దీపలు పాల్గొన్నారు.

## నైతిక విలువలతో కూడిన విద్యనందివ్వాలి



రామకృష్ణ మఠం ఉపాధ్యక్షుడు స్వామి సన్నివాసానందను సన్మానిస్తున్న పాఠశాల కరస్పాండెంట్

వేంపల్లె : విద్యాలయాలు విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యనందించినప్పుడే ఆ విద్యకు సార్థకత ఉంటుందని పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పులివెందుల రోడ్డులో ఉన్న స్వామి వివేకానంద పాఠశాల 24వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సంపదలో కన్న విద్యా సంపద గొప్పదని, అలాంటి గొప్ప సంపదను చిన్న వయస్సు నుండే క్రమ శిక్షణతో విద్యార్థులు నేర్చుకోవాలన్నారు. రామకృష్ణ మఠం ఉపాధ్యక్షుడు స్వామి సన్నివాసానంద మాట్లాడుతూ పిల్లలకు బాల్యం నుండే సేవాగుణం వచ్చేలాగా అటు తల్లిదండ్రులు, ఇటు ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. అనంతరం చదువులోనూ, ఆటల్లోనూ, సాంస్కృతిక కార్యక్రమాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మోడల్స్, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తులసిరెడ్డి, ఎస్ఐ తిరుపాల్ నాయక్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యథేచ్ఛగా పెద్దమ్మతల్లి గుడి సమీపంలో ప్రహారీ పనులు



దేవాలయం ప్రాంగణంలో ప్రహారీ పనులు కోసం తీసిన గుంతలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ఎర్రగుంట్ల మండలంలోని పోట్లదుర్తిలో ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి దేవాలయ ప్రాంగణంలో జిమ్, పార్క్, ప్రహారీల నిర్మాణ పనులు ఆపాలని హైకోర్టు ఆదేశాలు వచ్చినా కోర్టు ఆదేశాలను దిక్కరించి పనులు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గుడి ఆవరణలోని స్థలంలో ఎలాంటి పనులు చేయకూడదని మొదటి నుంచి స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. కానీ అనకాపల్లి ఎంపీ రమేష్‌నాయుడు ఎంపీ నిధులు కింద సుమారు రూ.90 లక్షలు విడుదల చేయించుకుని ఈ దేవాలయం ప్రాంగణంలోని ఆలయం భూమిలో ప్రహారీ ప్రహారీతో పాటు ఇతర పనులు చేపట్టాలని ఎంపీ రమేష్ నాయుడు సోదరుడు సురేష్‌నాయుడు ప్రయత్నాలు చేపట్టారు. దీంతో గ్రామస్తులు హైకోర్టును ఆశ్రయించడంతో ఆలయ ప్రాంగణంలో ఎలాంటి పనులు చేయకూడదని కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ ఆదేశాలను స్థానిక తహసీల్దార్‌కు చూపించామని స్థానికులు తెలిపారు. మొదట కోర్టు ఆదేశాలను స్థానిక రెవెన్యూ అధికారులు దిక్కరించినా అనంతరం ప్రహారీ పనులను నిలుపుదల చేయించారు.